


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 592 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర | 21 శుక్రవారం నవంబర్ 2025 | పేజీలు : 4 వెల : అమూల్యం



## అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తీసుకువద్దాం

-వ్యవసాయంలో పంచ సూత్రాలపై ఏడు రోజులపాటు కార్యక్రమాలు

-వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

2

వ్యవసాయ రంగంలో సమూల మార్పుల ద్వారా సాగును లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి కార్యక్రమాలు చేపట్టనుంది. 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి రైతు ఇంటికి వెళ్లనున్నారు. డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు చేపట్టనున్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సహా 10 వేల మందితో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.




## కేంద్రంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఫైర్

కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకురావడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. కోర్టు తీర్పులను పక్కనబెట్టే అధికారం పార్లమెంట్ కు లేదని పేర్కొంది. ఈమేరకు 2021 లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ ట్రైబ్యునల్‌తో పాటు పలు ట్రైబ్యునళ్లు రద్దయ్యాయని మద్రాస్ బార్ అసోసియేషన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టం అమలును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో న్యాయస్థానం కొట్టివేసిన చట్టాలకు.. వాటి నిబంధనల్లో స్వల్ప మార్పులు చేసి కొత్త చట్టాలు తీసుకురావడం రాజ్యంగ విరుద్ధమని అన్నారు. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది కోరగా.. సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు.కేసు ప్రాధాన్యతను బట్టి అవసరమైతే తామే విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తామని చెప్పారు. దీంతో ప్రభుత్వ




న్యాయవాది విచారణకు వాయిదా కోరగా సీజేఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను పదవీ విరమణ పొందే వరకూ ఈ కేసులో తీర్పు రావద్దని కోరుకుంటున్నారా?' అంటూ ప్రభుత్వ న్యాయవాదిని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం కోర్టు తీర్పులను ఉల్లంఘించడం సరికాదని పేర్కొంటూ.. ట్రైబ్యునళ్ల సంస్కరణ 2021 చట్టంలోని కీలక నిబంధనలను కొట్టివేస్తూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తీర్పు వెలువరించారు.

## తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలి

### - స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ఫిరాయింపు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై వివరణ కోరుతూ ఆయన ఈ నోటీసులు జారీ చేశారు. తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేయగా, సమాధానం ఇచ్చిన 8 మందిపై విచారణ కొనసాగుతోంది. దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని కోరారు.ఈ రోజుతో 8 మంది ఎమ్మెల్యేలకు చెందిన పిటిషన్లపై విచారణ పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో సభాపతి వారిద్దరికి మరోసారి



నోటీసులు జారీ చేశారు. తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని అందులో పేర్కొన్నారు. విచారణ పూర్తయిన ఎమ్మెల్యేలకు సంబంధించి న్యాయ సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత సభాపతి నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

## ప్రచారం మీడియా ఆధ్వర్యంలో 'స్త్రీ శక్తి ప్రతిభ అవార్డులు-2025'

**- ఏకదంత ప్రాచీన భారత విద్యాలయానికి 'కల్చరల్ ప్రిజర్వేషన్ -నోలెడ్జ్ ఎక్సలెన్స్ అవార్డు'**

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 20 : ప్రచారం మీడియా నిర్వహిస్తున్న "స్త్రీ శక్తి ప్రతిభ అవార్డులు-2025" కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 70 మంది విశిష్ట మహిళలు మరియు సాంస్కృతిక సంస్థలకు అవార్డులు ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో భాగంగా ఏకదంత - ది స్కూల్ ఆఫ్ ఏన్షెంట్ ఇండియన్ స్టడీస్ సంస్థను 'కల్చరల్ ప్రిజర్వేషన్ నాలెడ్జ్ ఎక్సలెన్స్ అవార్డు' కోసం ఎంపిక చేశారు. ప్రాచీన భారతీయ జ్ఞానం, సంస్కృతి, వేదాంత బోధనా సంప్రదాయాలను ఆధునిక తరానికి చేరవేస్తూ, వేలాది మంది విద్యార్థులకు సంస్కృతం, గీతా మరియు ప్రాచీన భారత విద్యలను బోధిస్తున్నందుకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేయబడుతోంది. ఈ కార్యక్రమం డిసెంబర్ 22-23, 2025 తేదీల్లో మల్లారెడ్డి యూనివర్సిటీ హైదరాబాద్లో జరుగనుంది. అవార్డు గ్రహీతగా ఆచార్య సీ.హెచ్ సద్గుణ హాజరవనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఏకదంత సంస్థలో 1500 మంది గీతా విద్యార్థులు, 3000 మంది వెబ్‌సైట్




ద్వారా ఆన్‌లైన్‌లో నేర్చుకుంటున్నారు. భారతీయ పరంపరల సంరక్షణలో ఈ సంస్థ చేస్తున్న సేవను ప్రచారం మీడియా ప్రత్యేకంగా అభినందించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో నిర్వాహకులు ప్రకటించనున్నారు.

# అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తీసుకువద్దాం

అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై టెలీకాన్ఫరెన్స్‌లో ఆయా శాఖలకు దిశానిర్దేశం చేశారు.

ఈ మేరకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి 'మీకోసం రైతన్నా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనున్నారు.

ఈ సందర్భంగా టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ "గత 7 నెలలుగా రైతులను, వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్తున్నాం. ఇప్పటికే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద దాదాపు 46.50 లక్షల మందికి పైగా రైతులకు రెండు విడతలుగా రూ.14 వేలు జమ చేశాం. రెండు విడతల్లో కలిపి రూ.6,310 కోట్లు రైతులకు చెల్లించాం. బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమం కూడా చేపట్టాం. ఇలాంటి వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను ప్రకటించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్ధతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టాం. ఈ పంచసూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలి. రైతులతో పాటు పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దారులు, ఆక్వా, ఉద్యాన, సెరీ కల్చర్ రైతులకూ అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ముందుండి చేపట్టాలి. దీంతో పాటు వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించాలి. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో యాక్షన్ ప్లాన్ చేయాలి" అని పేర్కొన్నారు.

**ప్రకృతి సేద్యం: అగ్రిటెక్ విధానాలతో కలిగే లాభాలు వివరించాలి**

రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని అన్నారు. శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుందని, ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ చేస్తున్నామని, రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించాలని అన్నారు. కడపలో ప్రకృతి సాగును కూడా పరిశీలించానని, ఆ సాగు రైతులు చాలా సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల కంటే గ్రోమోర్ కేంద్రాల్లోని ఎరువుల ధర తక్కువగా ఉందని అన్నారు.

"రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. రైతుల ఏ పంటలు సాగు చేశారు, వారికి ఎటువంటి సాయం కావాలనేది నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగుమందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను రైతులకు స్పష్టంగా అర్ధమయ్యేలా వివరించాలి. దీంతో పాటు తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలను, సేంద్రీయ సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఏ స్థాయిలో ఉందనేది వివరించాలి. పూర్తి వాటర్ మేనేజ్మెంట్ ద్వారా రిజర్వాయర్లను నింపగలిగాం. అలాగే సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు చెప్పాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వర్గీయకాటంరెడ్డి ఆదినారాయణ రెడ్డి స్మారక అవార్డు ప్రధానం

## -జిల్లాలో అత్యధిక సార్లు రక్తదానం చేసిన సురేష్ రెడ్డికి అందజేసిన కావలి రెడ్ క్రాస్

కావలి,

దేశంలో రక్తకొరత నివారించేందుకు యువత కృషి చేయాలని మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కావలి రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ లో అజ్ఞాత రక్తదాత స్వర్గీయ ఆదినారాయణ రెడ్డి స్మారక పురస్కార ప్రధానోత్సవం జరిగింది. కావలి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధిక జనాభా, యువత ఉన్న భారతదేశంలో రక్తకొరత ఏర్పడడం బాధాకరం అని అయన అన్నారు.రెడ్ క్రాస్ వంటి రక్తదానాన్ని ప్రోత్సాహంచే సంస్థలకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించడంతో పాటు, రక్తదాతలకు రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు ఇచ్చి ప్రోత్సాహించాలని అయన వివరించారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ, ప్రాణదాతలైన రక్తదాతలను ప్రోత్సాహించేందుకు,ఈ సంవత్సరం నుండి అజ్ఞాత రక్తదాత కాటంరెడ్డి ఆదినారాయణ రెడ్డిపేరుతో విశిష్ట రక్తదాత పురస్కారం ప్రారంభించామని, ఈ పురస్కారాన్ని ప్రతీ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాలలో ఉత్తమ రక్తదాతకు అందజేస్తామని అన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో అత్యధిక సార్లు రక్తదానం ( ప్లేట్ లెడ్స్, ప్లాస్మా మినహాయించి ) చేసిన కోవూరుకు చెందిన దేవిరెడ్డి సురేష్ రెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. స్వర్గీయ ఆదినారాయణ రెడ్డి కుమారుడు, రక్తదాత అయిన కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి. రవి



ప్రకాష్, వైస్ చైర్మన్ కె హరి నారపరెడ్డి, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్న కుమార్, నల్లిపోగు ప్రణీత్, జనిగర్ల మనోహర్ ,వివిధ విభాగాల కన్వీనర్లు జి.హరినాథ్,యస్ స్వర్ణలత,బి.రజిని,నెల్లూరు రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ కోఆర్డినేటర్ కలికి శ్రీహరిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులు గోసలగోపాల్ రెడ్డి,పూనూరు మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు, వృద్ధులకు నిత్యవసరాలు బట్టలు పంపిణీ

## -ఘనంగా యశ్వంత్ సాయి తేజ నాల్గవ వర్ధంతి వేడుకలు













గుడ్లూరు,

గుడ్లూరు మండల కేంద్రంలో యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు అద్దంకి అజయ్ బాబు తనయుడు యశ్వంత్ సాయి తేజ నాలుగవ వర్ధంతిని పురస్కరించుకొని వారి నివాసం వద్ద ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో అజయ్ బాబు బంధువులు,మిత్రులు పాల్గొని యశ్వంత్ సాయి తేజకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంనకు వచ్చిన పెద్దలు మాట్లాడుతూ చేతికి వచ్చిన కుమారుడు చనిపోయిన కష్టకాలంలో కూడా కృంగిపోకుండా నలుగురికి చేయూతనివ్వాలని దృఢ సంకల్పంతో అజయ్ బాబు ప్రతి ఏటా తన కుమారుని యొక్క జయంతి సందర్భంగా అనాథ ఆశ్రమాలలో అన్నదానాలు మరియు వర్ధంతి సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు బట్టలు, కొంతమంది మహిళలకు చీరలు,వృద్ధులకు దుప్పట్లు అలాగే పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు, అలాగే పదవ తరగతి పరీక్షల్లో అత్యున్నతమైనటువంటి మార్పులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించటం ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు అని తెలియ చేసారు. ట్రస్టు నిర్వాహకులు అజయ్ బాబు మాట్లాడుతూ మా కుమారుని జ్ఞాపకార్థం నేను ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా మా ట్రస్ట్ సభ్యుల సహకారంతో, మరియు మా కుటుంబ సభ్యుల సహకారం తో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయగలుగుతున్నానని తెలియచేసారు., ఈ కార్యక్రమంలో అభ్యుదయ స్కూల్ హెడ్ మాస్టర్ పి. కాలగా రెడ్డి అలాగే ఏసుబాబు ఆ స్కూల్ ఉపాధ్యాయుడు ఈనాడు పత్రిక విలేఖరి భరద్వాజ , దామా వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉన్న%శీ%.వెంకటేశ్వర్లు రావూరి వేణుగోపాల్, మేకల మాల్యాద్రి, అతంటి శ్రీనివాసులు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు జొన్నలగడ్డ. రమణమ్మ,ఎయిర్టెల్ చిన్న, స్కంద పురి జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుర్రం ఆదినారాయణ, సభ్యులు సుదర్శి నాగేశ్వరరావు, బోయల్ల మురళి, ఐఆర్టీలు శరత్, వెంకటేశ్వర్లు , అజయ్ బాబు బంధుమిత్రులు, అభ్యుదయ స్కూల్ టీచర్స్,స్కూలు విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా గుడ్లూరు మండల కేంద్రంలో ఉన్నటువంటి భాదీరుల స్కూలు లో చదువుతున్న 20 మంది విద్యార్థిని విద్యార్థులకు నూతన వస్త్రాలను మరియు 25 మంది మహిళలకు చీరలు 25 వృద్ధులకు దుప్పట్లు అలాగే 25 పేద కుటుంబాలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు.ఈ ట్రస్ట్ తరపున నిర్వహించిన ఈ కార్యక్రమముకు సహకరించిన దాతలు అందరికి మరియు ఈ కార్యక్రమముకు విచ్చేసి ఈ కార్యక్రమమును జయప్రదము చేసిన అందరికి "యశ్వంత్ సాయితేజ మెమోరియల్ ట్రస్ట్" తరపున అద్దంకి అజయ్ బాబు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేసారు.



# ఉద్యోగులకు రావలసిన డి ఎ పి ఆర్ సి ఇతర బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## - బాపట్ల జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షులు రోశయ్య

రేపల్లె

ఉద్యోగులందరికీ రావలసిన డి ఎ..పి అర్ సి.. ఐ ఆర్.. తదితర బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు కే రోశయ్య ప్రభుత్వాన్ని కోరారు.. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్లో ఉన్న బకాయిలు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ప్రభుత్వం వారు వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని ఆయన సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు..

# జిల్లా స్తాయి యువజనోత్సవాల్లో మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

పాతపట్నం

పాతపట్నం మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాల కు చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బై పి సి విద్యార్థిని ప్రీతి మజ్జి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మరియు సెట్ శ్రీ , శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు లో కథా రచన విభాగంలో ప్రతిభ చూపి తృతీయ బహుమతి పొందడం, ముఖ్యంగా విద్యార్థిని హిందీ భాషలో కథను వ్రాసి ఉత్తమ ప్రతిభ చూపించడం పట్ల విద్యార్థిని ని మోడల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి రత్నకుమారి , వైస్ ప్రిన్సిపల్ శ్రీ ప్రసాద రావు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థిని ని అభినందించారు..ఈ రోజు పాఠశాల అసెంబ్లీ లో ప్రీతి మజ్జి కు ప్రశంసాపత్రం మరియు జ్ఞాపికను, ప్రిన్సిపల్ రత్నకుమారి , మరియు తరగతి ఉపాధ్యాయులు అప్పలరాజు చేతులు మీదుగా బహుకరించారు

# పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు

## -తెనాలి మండల విద్యాశాఖ అధికారి జయంత్ బాబు..


## - తెనాలి జిల్లా ఇన్చార్జ్ శ్రీనివాసరావు ఆర్

పుస్తక పఠనం వలన ఏకాగ్రత పెరుగుతుందని జ్ఞానం మానసిక ఆరోగ్యం వంటి ప్రయోజనాలు కలుగుతాయని తెనాలి మండల విద్యాశాఖ అధికారి వి. జయంత్ బాబు తెలిపారు. గురువారం కొత్తపేట మహిళా బాలల గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు ముగింపు సభ ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి వి .జయంత్ బాబు విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో చరవాణి వాడకం విపరీతంగా పెరిగిపోయిందని విద్యార్థులు ఎక్కువగా పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పొందాలన్నారు అవసరానికి మాత్రమే చరవాణి వినియోగిస్తూ గ్రంథాలయాలు తరచూ సందర్శించి మంచి మంచి పుస్తకాలు చదవాలని సూచించారు. జిల్లా శాఖ గ్రంథాలయ కార్యదర్శి వంకధార సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ఈ వారం రోజులు విద్యార్థులతో, ప్రముఖుల ప్రసంగాలతో గ్రంథాలయాలు కళకళ లాడాయని ఇదే విధంగా ప్రతిరోజు గ్రంథాలయాలకు వస్తూ విద్యార్థులు పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవాలన్నారు వారోత్సవాల సందర్భంగా ప్రతిరోజు నిర్వహించిన వకృత్వ,వ్యాసరచన డ్రాయింగ్, మరియు ముగ్గుల పోటీలు కాంపిటీషన్స్ లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి కడియాల సుజాత, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి స్వరలయ వ్యవస్థాపకులు సాయి లక్కరాజు బహుమతులను అందజేశారు. సరస్వతీదేవి , చిన్నారి పెళ్లికూతురు, రాణి రుద్రమదేవి ఫాన్సీ డ్రెస్ వేషధారణలో పాల్గొన్న ప్రైమరీ స్కూల్ చెంచుపేట విద్యార్థినులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి,చల్లగాలి శ్రీదేవి,తన్నీరు శివశంకర్, అలపర్తి వెంకటేశ్వరరావు, షేక్ నాగుల్ షరీఫ్ , మున్సిపల్ బాయ్స్ హై స్కూల్, గర్ల్స్ హై స్కూల్

చెంచుపేట ప్రైమరీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# కార్తీక మాసం ముగింపు సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు గ్రామాలలో కోటి కుంకుమార్చన గోపూజ కార్యక్రమాలు

రేపల్లె



బాపట్ల జిల్లా విశ్వహిందూ పరిషత్ ధర్మ రక్షా ప్రసార విభాగం ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా జిల్లా మండలాలలో రేపల్లె భట్టిప్రోలు కొల్లూరు ప్రఖండలలోని గ్రామాలలో రేపల్లె , పేటేరు , పెద్ద అరవపల్లి భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాలలో కొల్లూరు, గ్రామాలలో కోటి కుంకుమార్చన గోపూజ కార్యక్రమాలు నిర్వహించటం జరిగినది ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు సి హెచ్ కిషోర్ బాబు బాబు పినపాల సత్య సాయి బాబు, ఎల్ . కుటుంబరావు ధర్మ రక్షా ప్రసార కార్యకర్తలు డి . మాధవి,జి దుర్గా ప్రసన్న ,మోర్ల ప్రియ దుర్గ ,కె శివనాగేశ్వరి ,డి చంద్రమ్మ ,రత్నకుమారి, వి .శివ నాంచారయ్య, లోయ రమాదేవి,వి శ్రీలక్ష్మి, నాగ ప్రియాంక, పూర్ణకుమారి, కృష్ణవేణి జిల్లా కో ఆర్డినేటర్ జి. కుటుంబరావు గారు పాల్గొని సనాతన ధర్మాల గురించి గోమాత విశిష్టత ల గురించి కార్తీక మాసం విశిష్టత గురించి వివరించటం జరిగినది

# జగ్గంపేటలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

**- వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షులు ఇరుకుళ్ళ రామకృష్ణ గుడ్ విల్ విజిట్ 2025**

**- మాజేటి సత్యనారాయణ తన భార్య రమాదేవి జ్ఞాపకార్థం తొమ్మిది లక్షల విలువ గల కారు వితరణ**



జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 20 : స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ బీటెక్ యూత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జగ్గంపేట వాసవి క్లబ్ అధ్యక్షుడు మానేపల్లి రామానుజ అధ్యక్షతన క్లబ్బు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుళ్ళ రామకృష్ణ గుడ్ విల్ విజిట్ 2025 కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మరో ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్బు ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు హాజరయ్యారు. గుడ్ విల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలలో భాగంగా వికాస తరంగిణి కాకినాడ వారికి తొమ్మిది లక్షల విలువగల కారు వితరణ చేసిన మాజేటి సత్యనారాయణ వారి భార్య రామాదేవి జ్ఞాపకార్థం కారు అందించారు. బీపీ, షుగర్ వ్యాధి గుర్తింపు వైద్య శిబిరం నిర్వహించారు. ఎంబిబిఎస్ చదువుతున్న పేద విద్యార్థినికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇంద్రపాలెంలో గల శ్రీ గోపాల గో సంరక్షణ సంఘంకు రూ.50 వేలు వితరణ, వాసవి మనో నేస్తం మనో దివ్యాంగం సహాయం కింద మానసిక దివ్యాంగులకు దుప్పట్లు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుళ్ళ రామకృష్ణ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. ముఖ్యంగా జగ్గంపేట వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనిత క్లబ్ వాసవి బిటెక్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఇసి ఆఫీసర్ నాళం ఆండాళ్, క్యాబినెట్ సెక్రెటరీ మామిడిపాక సతీష్, క్యాబినెట్ ట్రెజరర్ కంచర్ల వెంకట సత్యనారాయణ, ఐపిసి బొండా వీర సత్యనారాయణమూర్తి, ఐపిసి గ్రంధి నాగబాబు, మతంశెట్టి నారాయణ, మతంశెట్టి లావణ్య, ఉద్దగిరి కామేష్, మానేపల్లి యామిని, బోండా అయ్యప్ప, నిట్టల శ్రీనివాస్, నిట్టల నాగలక్ష్మి, మతంశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## సత్తిబాబుకి అండగా పిఠాపురం జర్నలిస్టు అసోసియేషన్ యూనియన్

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 20 : యండపల్లి మండలం జోన్నలగరవులో నివాసం ఉంటున్న జర్నలిస్ట్ సత్తిబాబు అనారోగ్యంతో బాధపడుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సత్తిబాబుకి అండగా పిఠాపురం జర్నలిస్టు అసోసియేషన్ యూనియన్ నిలబడింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాయుడు శ్రీనుబాబు మాట్లాడుతూ తోటి జర్నలిస్ట్ అయిన సోదరుడు దడాల సత్తిబాబు ఆరోగ్యం బాలేనందువల్ల ఫీస్టులా సర్జరీ చేయవలసి వచ్చిందని, అందుచేత సోదరులందరూ కలిసి పిఠాపురం జర్నలిస్టు అసోసియేషన్ యూనియన్ తరపున రూ.5వేలు ఆర్థిక సహాయం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సహకరించినజర్నలిస్టు సోదరులందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాయుడు శ్రీనుబాబు, సెక్రటరీ చిన్ని, వైస్ ప్రెసిడెంట్ బళ్ళ సురేష్, టి.కామేశ్వరరావు(కరుణ్ రాజు), వై.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు



కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 20 :
గండేపల్లి మండలం యర్రంపాలెం గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు ముత్యాల సత్యనారాయణ తల్లి ముత్యాల సరస్వతి ఇటీవల మరణించారు. విషయం తెలిసిన రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షుడు పోతుల మోహన్ రావు గురువారం యర్రంపాలెం గ్రామంలోని ముత్యాల సత్యనారాయణని వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పూతల మోహన్రావు, సర్పంచ్ ముత్యాల దుర్గారావు, ముత్యాల భాస్కరరావు, బిక్కిన వెంకటరమణ, బిక్కిన వీరభద్రరావు, ముత్యాల రాంబాబు, ముత్యాల వీరభద్రరావు, ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# పేదల సొంతింటి కల నిజం చేస్తున్నాం


**- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

**ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు సాంక్షన్ ఉత్తర్వులు అందించిన ఎమ్మెల్యే**

**కందుకూరు అర్బన్ పరిధిలో 417 ఇళ్లు మంజూరు- రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక**

**అనుభవజ్ఞుడు చంద్రబాబు పాలనలో అంతా మంచే జరుగుతోంది**















కందుకూరు

పేదల సొంతింటి కలలు నిజం చేయటంలో భాగంగా, కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్లు మంజూరు చేస్తోందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు అర్బన్ పరిధిలో 417 మందికి ప్రభుత్వం తరపున ఇళ్లు మంజూరు కాగా, అందుకు సంబంధించిన సాంక్షన్ ఉత్తర్వులను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని బృందావనం, కోటారెడ్డి నగర్ 1,2 సచివాలయాల పరిధిలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ కే. అనూష, హౌసింగ్ ఈఈ మాధవరావు, డి ఈ నారాయణ, తహసిల్దార్ లావణ్యతో కలిసి లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందించారు.

ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో పేదల కోసం టిడ్కో ఇళ్లను కట్టించిన సంగతిని గుర్తు చేశారు. కందుకూరు పట్టణంలో 1400 కుటుంబాలు, టిడ్కో ఇళ్లల్లో కాపురం ఉంటున్నారని చెప్పారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం కనీసం 10% పనులు పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఊరికి దూరంగా వాగులు, వంకల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వైసిపి హయాంలో నిర్మించిన కాలనీ ఇళ్లకు బిల్లులు మధ్యలో ఆపేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విమర్శించారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని , సొంత స్థలాలు ఉండి ఇల్లు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఏవైనా సమస్యలు ఉంటే, వారికి అన్యాయం జరగకుండా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సొంతగా స్థలాలు లేని వారికి పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు చొప్పున ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అవసరమైతే ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు ఇస్తామని నాగేశ్వరరావు తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత చంద్రబాబు నాయుడు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ.ఈ ఇంటూరి సుబ్బారావు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విద్యాశాఖ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీనివాస్ రావు, కంద్రా మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, కల్లూరి శైలజ, మహర్షి శ్రీను, చనమాల శ్రీధర్, గేరా నరేష్, దాసరి ప్రమోద్, శ్యామ్ పాలేటి కోటేశ్వరరావు, వడ్డెళ్ళ రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, గడ్డం మాలకొండయ్య, కూనం నరేంద్ర ముచ్చు వేణు, గుమ్మా శివ, వలేటి వెంకటేశ్వర్లు, వడ్లమూడి చెంచు నారాయణ, యోగేశ్వరరావు, మంచిరాజు మురళి, మేడ మల్లికార్జున, చుండూరి శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, అత్తోట మాల్యాద్రి, మురారి శెట్టి వెంకట సుధీర్, కొత్తూరు వెంకట సుధాకర్, షేక్ రూబీ, జియావుద్దీన్, కొచ్చర్ల తనూజ్ కుమార్, పరుసు నాగేశ్వరరావు, నగర జయకృష్ణ అన్ని వార్డు అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నేతలు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు..



## వీఆర్ఏల సమస్యలు వెంటనే పరిష్కరించి, పే స్కేలు అమలు చెయ్యాలి...


**-యూనియన్ కార్యదర్శి వెంకటయ్య డిమాండ్...**

వెలిగండ్ల,

వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని అర్హులకు విఆర్ఓగా ప్రమోషన్ ఇవ్వాలని, అలాగే నామినేలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాలో భాగంగా గురువారం వెలిగండ్ల మండల తాసిల్దార్ ఎం వాసుకి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం అందించడం జరిగినది. అనంతరం కార్యదర్శిమాట్లాడుతూ,రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చాక జీతాలు పెరుగుతాయని, ప్రమోషన్లు అమలు చేస్తారని ,వీఆర్ఏలు ఆశించారని , కానీ గత 16 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ఈఆర్ఏలసమస్యలు ఏ ఒక్కటి పరిష్కరించలేదని వారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి వీరబోయిన అంకయ్య, మండల కమిటీ సభ్యులుఈర్లపోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ,ఖో. ఖో పోటీలకు వలేటివారిపాలెం విద్యార్థులు ఎంపిక.

వలేటివారిపాలెం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి క్రీడా పోటీల ఎంపికలలో భాగంగా తేదీ 18. న పాకల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు జిల్లా ఖో. ఖో జట్ల ఎంపిక జరిగింది... ఈ ఎంపికలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వలేటివారిపాలెం విద్యార్థులు 17 సంవత్సరాల విభాగంలో చప్పిడి అశ్విత, 14 సంవత్సరాల విభాగంలో చొప్పర లోకేష్,, ఈర్ల పూజిత రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనటానికి అర్హత సాధించారు. అదేవిధంగా తేదీ 19.న కనిగిరి నియోజకవర్గం కంచర్ల వారి పల్లి లో జరిగిన జిల్లా కబడ్డి సెలక్షన్స్ నందు 17 సంవత్సరాల విభాగంలో మర్రి మని విష్ణు, 14 సంవత్సరాల విభాగంలో గూడూరు సంతోష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారు...
వీరందరూ త్వరలో కర్నూల్, మచిలీపట్నం లో జరగబోవు రాష్ట్రస్థాయి ఖో. ఖో,, కబడ్డీ పోటీలలో పాల్గొంటారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రావీణ్యం సాధించి పాఠశాలకు అదేవిధంగా గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎస్వీఎన్ కమల్ కుమార్ గారు అభినందించారు..అదేవిధంగా పాఠశాల ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆశీస్సులు అందించి మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.... స్థానిక పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కత్తి ఐజక్ ను పలువురు అభినందించి మునుముందు విద్యార్థులను ఇలాగే తీర్చిదిద్దాలని శుభాకాంక్షలు తెలియజేశారు.



# సినీ నటుడు ప్రకాష్ వ్రాసిన "నేను నా ప్రయాణం" పుస్తకాన్ని ఆవిష్కరించిన దర్శకులు తేజ



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 20 : పాత తరం తెలుగు సినీ మూలాలు కలిగిన క్యారెక్టర్ ఆర్టిస్ట్ బత్తుల ప్రకాష్ బాబు వ్రాసిన "నేను నా ప్రయాణం" అనే పుస్తకాన్ని గురువారం మధ్యాహ్నం ప్రముఖ సినీ దర్శకులు తేజ గారు వారి ఆఫీస్ లో ఆవిష్కరించారు. తాను వ్రాసిన ప్రతి అంశాన్ని సునిశితంగా చూసినందుకు చాలా ఆనందంగా ఉందని నటుడు ప్రకాష్ తెలిపారు. తనకు 2012లో రిలీజ్ అయిన నీకు నాకు డాష్ డాష్ చిత్రంలో దర్శకులు తేజా గారు అవకాశం ఇచ్చి ప్రోత్సహించినందుకు వారికి ఎప్పుడూ రుణపడి ఉంటానని ప్రకాష్ తెలిపారు. తాను వ్రాసిన పుస్తకం తన జీవితంలోని ఎత్తు పల్లాలను ప్రతిభింభించడమే కాక, సమాజంలో తనకు తారసపడిన, మనసును కలచి వేసిన సమస్యపై భావ కవితలు రూపంలో అటు యువతను ఇటు సమాజాన్ని మేల్కొలిపేవిగా ఉంటాయన్నారు. విశ్వనటులు స్వర్గీయ ఎస్.వి.రంగారావు గారు వారి తాత చిట్టాడ చిన్న (ముత్యాలు) గారికి విద్యార్థి దశనుండి కాకినాడ పి.ఆర్.కాలేజీలో ప్రాణ స్నేహితులు కావడమే కాక, యంగ్ మెన్స్ క్లబ్ లైఫ్ మెంబెర్స్ అని తెలిపారు. తన పెద్దమ్మ కుమారునికి తొడల్లుడు అయిన, నిర్మాత టి.త్రివిక్రమరావు బ్యానర్ అయిన విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ ఆహ్వానం మేరకు తన తండ్రి బత్తుల రాంబాబు పూర్తి సేవలు అందించి, వారి ఉన్నతికి తోడ్పాటు ఇచ్చారన్నారు నటులు ప్రకాష్.

తన తండ్రి ఉత్తమ రంగస్థల దర్శకులు, నటులుగా ప్రశంసలు పొందిన వారని తెలిపారు.

తాను 25 సంవత్సరాలుగా జర్నలిస్ట్ గా పనిచేస్తున్నట్టు తెలిపారు. వీరి స్వస్థలం పిఠాపురం నియోజకవర్గం కాగా... అటుగా షూటింగ్స్ కు వచ్చి తనను కలసిన ప్రతి డైరెక్టర్ కు పూర్తి సహకారం అందిస్తూ.. నటుడుగా తనకు వచ్చిన సినీ అవకాశాలను అందిపుచ్చుకున్నారన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లోనే ఉంటూ తన ప్రయత్నాలను క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తున్నట్టు తెలిపారు. దూరపు కొండలు నునుపు అన్నట్టు దగ్గరగా చూస్తే కానీ ఆర్టిస్ట్ ల పరిస్థితి అర్ధం కాదని, అందుకే తాను కూడా ఇప్పటి వరకు లేని, రాని కంటెంట్ తో మంచి కథను వ్రాస్తున్నట్టు తెలిపారు. వారికి భవిష్యత్తులో తనను తాను నిరూపించుకునే అవకాశాలు రావాలని మనసారా కోరుకుందాం.

# నేడు థియేటర్లలోకి అల్లరి నరేశ్ 12ఎ రైల్వే కాలనీ




టాలీవుడ్ యాక్టర్ అల్లరి నరేశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న థ్రిల్లర్ ప్రాజెక్ట్ '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో డాక్టర్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రం 21న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అల్లరి నరేశ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.కాగా ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఇంకా థియేటర్లలోకి రాకముందే ఓటీటీ పార్ట్‌నర్‌ను ఫిక్స్ చేసుకుంది. ఈ

మూవీ ఓటీటీ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో భారీ మొత్తానికి దక్కించు కున్నట్టు టాలీవుడ్ సర్కిల్ సమాచారం. థియాట్రికల్ రన్ తర్వాత మేకర్స్ ఓటీటీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వనున్నారు. 12ఎ రైల్వే కాలనీలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీకి 'పొలిమేర', 'పొలిమేర 2' ఫేం డాక్టర్ అనిల్‌విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూరుస్తున్నారు. క్కువగా కామెడీ సినిమాలెందుకు చేయడం లేదని ప్రమోషన్స్‌లో అల్లరి నరేశ్‌ను ప్రశ్నించగా .. దీనికి అల్లరి నరేశ్ స్పందిస్తూ.. కామెడీ సినిమాలు తీయాలంటే ఇప్పుడు చాలా కష్టతరమైన పరిస్థితులు ఉన్నాయి. మేం ఒకవేళ ఇప్పుడు కితకితలు చేస్తే.. బాడీ షేమింగ్‌తో సినిమాను పక్కన పెట్టేస్తారు. ఇప్పుడు కొన్ని విషయాలు చాలా సున్నితంగా మారాయి. కొంతమంది మనోభావాలు దెబ్బతినే అవకాశముంది. ఈ రోజుల్లో మనం కలర్, బరువుతోపాటు ఇతర సున్నిత అంశాలపై మాట్లాడకూడదన్నాడు. ప్రేక్షకుల అభిరుచి ప్రతీ పది సంవత్సరాల కోసారి మారుతూ వస్తుంది. నేను గతంలో రైమింగ్ డైలాగ్స్, కౌంటర్స్‌తో సాగేకామెడీ సినిమాలు చేసేవాడిని. సుడిగాడు స్పూఫ్ సినిమా.ప్రేక్షకులు కూడా ప్రతీ కంటెంట్‌పై స్పూఫ్స్ చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జోకులు ఖచ్చితంగా ఆర్గానిక్‌గా ఉండాలి. వాటిని సోషల్ మీడియా మీమ్స్‌ను నుంచి అస్సలు కాపీ చేయొద్దు. జనాలు ఇప్పుడు ఆర్గానిక్‌గా ఉండే సెన్సిబుల్ కామెడీని ఆశిస్తున్నారని చెప్పుకొచ్చాడు అల్లరి నరేశ్.






# రజనీకి హెచ్‌టి అత్యున్నత గౌరవం

అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ ఆంగ్ల పత్రిక హిందుస్థాన్ టైమ్స్ ఫ్రంట్ పేజీలో ఆయన ఫొటోను ముద్రించారు. ఈ పత్రిక స్థాపించిన వందేళ్లలో ఇలా ఒక పేజీ మొత్తం హీరో ఫొటోను ముద్రించడం తొలిసారి కావడం విశేషం. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హిందుస్థాన్ టైమ్స్ తలైవాను ఇలా గౌరవించింది. సినీ ఇండస్ట్రీని ఎంతో ప్రభావితం చేసిన వ్యక్తికి ఇలాంటి గౌరవాన్ని కల్పించడం ఆనందంగా ఉందని పత్రిక పేర్కొంది. నవంబర్ 19న పేపర్‌లో రజనీ ఫొటో చూసి పాఠకులు ఆశ్చర్యపోయారు. ఇది ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవం అంటూ ఆనందం వ్యక్తంచేశారు. దీనిపై రజనీకాంత్ కూడా స్పందించారు. అద్భుతమైన సర్‌ప్రైజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. తనపై చూపుతోన్న ప్రేమాభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. 1975లో 'అపూర్వ రాగంగళ్'తో సినీ రంగప్రవేశం చేసిన రజనీకాంత్ ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఈ నెలలో గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి - 2025) ముగింపు వేడుకల్లో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు.

# కళ్యాణి ప్రియదర్శి కొత్త చిత్రం ప్రారంభం



కళ్యాణీ ప్రియదర్శన్ ఇవాళ మలయాళ చిత్ర సీమలో స్టార్ హీరోయిన్. అగ్ర కథానాయకుల సినిమాలను మించి పోయి... ఆమె నటించిన 'లోకా' పార్ట్ వన్ మూడు వందల కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. దీంతో ఒక్కసారిగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలకు క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం కార్తీ సరసన 'మార్షల్' సినిమాలోనూ, 'జయం' రవి 'జీనీ'లోనూ ఆమె నటిస్తోంది. అలానే 'లోకా' మూవీ సక్సెస్ తర్వాత కళ్యాణీ ప్రియదర్శన్ తో సినిమా తీయడానికి చాలామంది మేకర్స్ తహతహలాడుతున్నారు.

ఇదిలా ఉంటే... పొటెన్షియల్ స్టూడియోస్ సంస్థ తన ఏడో సినిమాను కళ్యాణ్ ప్రియదర్శన్ తో మొదలు పెట్టింది. గతంలో 'మాయ, మానగరం, మాన్ స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్' వంటి విజయవంతమైన సినిమాలను ఈ నిర్మాణ సంస్థ రూపొందించింది. ఈ సినిమాలో 'నాన్ మహానల్లా' ఫేమ్ దేవదర్శిని, వినోద్ కిషన్ కీలక పాత్రలు పోషించబోతున్నారు. ఈ మూవీతో ధీరవియం ఎస్.ఎన్. దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ప్రవీణ్ భాస్కర్, శ్రీకుమార్ దీనికి దర్శకుడితో కలిసి స్క్రీన్ ప్లే, సంభాషణలు అందిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తుండగా, గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు.ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు, పి. గోపీనాథ్, తంగప్రభహరన్ ఆర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో పూజా కార్యక్రమాలతో బుధవారం ప్రారంభమైంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com